క్లుప్తంగా

మార్కెట్‌లోకి 'హీరో' కొత్త వాహనం


వాహనాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని రాజ్యలక్ష్మి హీరో షోరూంలో న్యూ ఎక్స్‌ట్రీం 125 ఆర్ ద్విచక్రవాహనాన్ని ఎస్‌బీఐ అకౌంట్స్ మేనేజర్ పరమేశ్వర్, అసిస్టెంట్ మేనేజర్ అరుణ్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో షోరూం డీలర్ మచ్చా వెంకటేశ్వరరావు, మెకానిక్ ప్రెసిడెంట్ రామ్‌కుమార్, సంపత్, కిశోర్ పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఓగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ఇల్లెందు: ఇల్లెందు నూతన ఎఫ్‌ఆర్‌ఓగా డీపీఎస్‌కే ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఇల్లెందు ఎఫ్‌ఆర్‌ఓ కార్యాలయంలో గత ఎఫ్‌ఆర్‌ఓ నాగేశ్వరరావు నుంచి బాధ్యతలు స్వీకరించిన అనంతరం రేంజ్ పరిధిలోని సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. రేంజ్ పరిధిలోని అటవీ అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా, ప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిబ్బంది పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు.

20న శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం


ఆలయ ఆవరణలో రంగులు వేస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి వెంకటేశ్‌ఖని గుట్టపై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణానికి ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 17 నుంచి అధ్యయనోత్సవాలు జరగనుండగా, 19న శ్రీవారికి అభిషేకం, 20న బుధవారం కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ మేరకు మంగళవారం ఎదుర్కోలు ఉంటుందని ఆలయ నిర్వాహకులు, వీకే–7 షాఫ్ట్ మేనేజర్ అభిలాష్ తెలిపారు. సింగరేణి ఉద్యోగులు, కార్మికులు, స్థానిక భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

మెడికల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులు.. కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ చేపట్టారు. కార్యక్రమానికి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలోని మెస్ బిల్లుల్లో అవినీతి జరిగిందని, కళాశాల నిధులు దుర్వినియోగమయ్యాయని, విద్యార్థినుల పట్ల అసభ్యంగా మాట్లాడుతున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలో బస్ ఫీజులు వసూలు చేస్తున్నారని, అంతర్ కళాశాలల గేమ్స్‌కు అనుమతించటం లేదని, కళాశాలలో నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థులపై పెత్తనం చెలాయిస్తున్నారని తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి..


వినతిపత్రం అందజేస్తున్న నరసింహారావు

జూలూరుపాడు: మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు సోమవారం ఎంపీఓ తులసీరామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందుస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

వ్యాపారులకు వ్యవసాయశాఖ నోటీసులు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం ప్రాంత రైతులు ఆర్‌ఎన్‌ఆర్ రకం వరి విత్తనాల వల్ల కలిగిన నష్టంపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. విత్తనాల నాణ్యతపై ఆరా తీసిన వారు.. రైతులకు విత్తనాలు విక్రయించిన ఆరుగురు వ్యాపారులు, విత్తన సంస్థల నుంచి వివరణ కోరుతూ సోమవారం నోటీసులు జారీ చేశారు.

'పది' పరీక్షలు షురూ..

పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను ఉదయం 9 గంటల నుంచే అనుమతించారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే లోపలికి పంపించారు. మాల్ ప్రాక్టీస్‌కు ఏమాత్రం అవకాశం లేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రానికి ఇన్విజిలేటర్లు కూడా సెల్‌ఫోన్ తీసుకురావొద్దని నిబంధన విధించడంతో ఎవరూ కూడా ఫోన్లు తీసుకురాలేదు. పలు కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పలువురు అధికారులు పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

-సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంఅర్బన్: పరీక్ష కేంద్రం ఎదుట విద్యార్థులు, వారి తల్లిదండ్రులు


కొత్తగూడెంఅర్బన్: సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు


కొత్తగూడెంఅర్బన్: కుతూరుకు 'ఆల్ ది బెస్ట్' చెబుతున్న తండ్రి


పాల్వంచ: తనిఖీ చేసి పరీక్ష కేంద్రం లోపలికి పంపిస్తున్న ఉపాధ్యాయులు


పాల్వంచరూరల్: కిన్నెరసాని పరీక్ష కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు


సుజాతనగర్: మండల కేంద్రంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు


ఇల్లెందురూరల్: టీడబ్ల్యూఆర్ఎస్ పరీక్ష కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు


జూలూరుపాడు: పరీక్ష కేంద్రం వద్ద బారులుదీరిన విద్యార్థులు


టేకులపల్లి: విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి పంపిస్తున్న ఉపాధ్యాయులు


పాల్వంచ: హాల్ టికెట్ నంబర్లను సరిచూసుకుంటున్న విద్యార్థులు


కొత్తగూడెంఅర్బన్: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

23న పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఎన్నిక

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రాథమిక సహకార సంఘం వైస్ చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ నెల 23న వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు మంగళవారం ఎన్నికల అధికారి శ్రీనివాసరావు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. దీని కోసం మంగళవారం పీఏసీఎస్ డైరెక్టర్ల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఫిబ్రవరి 12వ తేదీన పీఏసీఎస్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ పది మంది డైరెక్టర్లు డీసీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. దీనికి బదులుగా తనకు పదవి పట్ల వ్యామోహం లేదని పేర్కొంటూ ఫిబ్రవరి 14వ తేదీన వైస్ చైర్మన్ బండారు శ్రీనివాస్ తన పదవికి రాజీనామా చేసి, లేఖను ఇల్లెందు పీఏసీఎస్ కార్యాలయంలో అందజేశారు. ప్రస్తుతం పీఏసీఎస్‌లో 13 మంది డైరెక్టర్లు ఉండగా అందులో కాంగ్రెస్‌కు పది మంది సభ్యుల బలం ఉంది. బీఆర్ఎస్‌కు ఇద్దరు, న్యూడెమోక్రసీకి ఒకరు చొప్పున డైరెక్టర్లు ఉన్నారు. డైరెక్టర్ల సంఖ్యా బలాన్ని బట్టి చూస్తే కాంగ్రెస్‌కు వైస్‌చైర్మన్ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

హమాలీ రేట్లు పెంచుతూ నిర్ణయం

ఇల్లెందురూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో హమాలీ రేట్ల పెంపుపై హమాలీ వర్కర్స్ యూనియన్, వ్యాపారుల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు సోమవారం పోలారంలో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం.. ఇప్పటివరకు కొనసాగిన ధరలపై 15 నుంచి 20 శాతం పెంచనున్నారు. ఈ ఒప్పందం 2025 నవంబర్ 15వ తేదీ వరకు అమలులో ఉంటుందని వ్యాపారులు, హమాలీ వర్కర్ల యూనియన్ ప్రతినిధులు వెల్లడించారు. చర్చల్లో వ్యాపారులు మోడెం వెంకన్న, నాళ్ల మనోహర్, ఉమామహేశ్వరరావు, రమేశ్, ధరావత్ శ్రీను, చందర్, యూనియన్ ప్రతినిధులు సారంగపాణి, పందిర్లపల్లి వీరన్న, కొప్పుల శ్రీనివాస్, బొర్ర భిక్షం, తారాచంద్, కృష్ణ, శంకర్, రామారావు, సురేశ్, శ్రీను పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రాధాన్యత

ఇల్లెందు: వెనుకబడి ఉన్న ముదిరాజ్‌లను ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేసేందుకు ప్రాధాన్యత ఇస్తామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. సోమవారం ఇల్లెందులోని ఐతా ఫంక్షన్ హాల్లో పట్టణ, మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ చేతుల మీదుగా ఆరు గ్యారంటీలు అమల్లోకి వచ్చాయని, వీటితో అట్టడుగు కులాలు బలోపేతం అవుతాయని తెలిపారు. ముదిరాజ్‌లు గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన నిలిచారని, అలాంటి వారికి అన్నివిధాలా అండగా ఉంటామని చెప్పారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు అండగా నిలిచి ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గంధి సదానందం, బోళ్ల సాగర్, బోళ్ల సూర్యం, ఎరసంగి వెంకన్న, పురుషోత్తం, బండి రాజయ్య, యాటకారి రాజయ్య, బొల్లి రాజయ్య, వారా రవి, సీహెచ్ వెంకన్న పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కనకయ్య, చైర్మన్ డీవీని సత్కరిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

నాయీబ్రాహ్మణుల ఆధ్వర్యంలో..

ఎమ్మెల్యే కోరం కనకయ్యను పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. ముత్యాల లక్ష్మణ్‌తోపాటు కంది సదానందం, మండల రాము పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పోస్టులు భర్తీ చేయాలి


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న శివశంకర్

సింగరేణి(కొత్తగూడెం): సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సింగరేణి సంస్థలో ఖాళీలను 33 శాతం ఇంటర్నల్, 66 శాతం ఎక్స్‌టర్నల్ అభ్యర్థులతో భర్తీ చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్యకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. యాజమాన్యం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఇంటర్నల్ వారికి అత్యధిక పోస్టులు కేటాయించి ఎక్స్‌టర్నల్ పోస్టులు తగ్గించిందని తెలిపారు. తద్వారా నిరుద్యోగులకు అన్యాయం జరిగే అవకాశమున్నందున మరోమారు పరిశీలించాలని డిమాండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇంటర్నల్ వారికి 360 కేటాయించగా, ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌లో ఒక్క పోస్టు కూడా ఇవ్వలేదని తెలిపారు. దీంతో స్పందించిన జీఎం సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వెల్లడించారు.

నాణ్యత లేని విత్తనాలతోనే నష్టం

రైతులను ఆదుకోవాలని ఏఓకు మాస్‌లైన్ నాయకుల వినతి


ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు, రైతులు

ఇల్లెందురూరల్: యాసంగిలో ఆర్‌ఎన్‌ఆర్ రకం విత్తనం వల్లే చాలా మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని, విత్తన నాణ్యత లోపం వల్లే ఇలా జరిగిందని ఆరోపిస్తూ ఏఓ సతీశ్‌కు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు నాయిని రాజు, ఎంపీటీసీ అజ్మీర బిచ్చా సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌ఎన్‌ఆర్ రకం నారును పొలంలో నాటిన నెల రోజులకే కంకులు వచ్చాయని, దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంగానే ఇల్లెందు పట్టణ, మండల పరిధిలో వ్యాపారుల వద్ద రైతులు కొనుగోలు చేసిన విత్తనాలను అనుమానించాల్సి వస్తోందని స్పష్టం చేశారు. ఈ మేరకు మండలంలోని కొమరారం ప్రాంత రైతులు తమకు జరిగిన నష్టాన్ని వివరిస్తూ వ్యక్తిగతంగా వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న మేనేజర్ ప్రవీణ్

సుజాతనగర్: అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి పీఎంజేజేబీవై నుంచి మంజూరైన రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఏపీజీవీబీ మేనేజర్ ప్రవీణ్ సోమవారం అందజేశారు. జూలూరుపాడు మండలం చింతలతండా గ్రామానికి చెందిన వాంకుడోత్ దేవా స్థానిక ఏపీజీవీబీలో ఏడాదికి రూ.436 చొప్పున ఇన్సూరెన్స్ చెల్లించాడు. ఆయన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మంజూరైన చెక్కును ఆయన భార్య లక్ష్మికి అందజేశారు. అరుణ్ కుమార్, సీహెచ్ రమేశ్, డి.సురేశ్, సంధ్య పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: ప్రధాని నరేంద్రమోదీ ఫాసిస్ట్, మతోన్మాద విధానాలు అవలంబిస్తున్నారని, వీటిని వ్యతిరేకిస్తూనే.. ఈ నెల 23వ తేదీ వరకు జరిగే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి కార్యక్రమాలను గ్రామగ్రామాన నిర్వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు గౌని నాగేశ్వరరావు కోరారు. సోమవారం నటరాజ్ సెంటర్‌లో పీడీఎస్‌యూ, పీవైఎల్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తుక్కాని లక్ష్మణ్, వీరమల్ల మల్లయ్య, ఎర్రం శ్రీనివాస్, కల్లెం కళింగరెడ్డి, రాము, రాజు, రమేశ్, మైసా భాస్కర్, ప్రసాద్, పవన్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

పాల్వంచ: అన్నదమ్ముల మధ్య తలెత్తిన ఆస్తి తగాదాలో ఒకరిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మందెరకలపాడు గ్రామానికి చెందిన బానోతు చిన్న మోహన్‌కు సోదరులైన బానోతు వీరు, నందా, రాజాలకు మధ్య ఆస్తి విషయంలో ఘర్షణ తలెత్తింది. దీంతో చిన్న మోహన్‌పై మిగతా ముగ్గురు దాడి చేయడంతో తీవ్రగాయాలు కాగా, ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మోహన్ సోదరుడు సుమన్ ఫిర్యాదు చేయడంతో దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కోసం మరో ఉద్యమం

ఇల్లెందు: మాదిగ రిజర్వేషన్ సాధన కోసం మరో పోరాటానికి శ్రీకారం చుట్టబోతున్నామని, ఈ నెల 19న సూర్యాపేటలో జరిగే సభకు అత్యధికంగా తరలి వెళ్లాలని టీఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేకల శ్యామ్‌మాదిగ తెలిపారు. సోమవారం ఇల్లెందులో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేతలు ఇటుక రాజు, నూతన రాష్ట్ర అధ్యక్షులు సిరిసిల్ల బాలరాజుమాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేశ్‌మాదిగ సభకు హాజరవుతున్నారని తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

సుజాతనగర్: మన ఇసుక – మన వాహనంను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జి.శిరీష తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 18 ఇసుక రీచ్‌లను అధికారికంగా ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారని చెప్పారు. మన ఇసుక – మన వాహనం ద్వారా ఇసుక పొందటానికి యాప్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మనకు దగ్గరలో పాల్వంచలో 4, లక్ష్మీదేవిపల్లిలో 2 ఇసుక ర్యాంపులు అందుబాటులో ఉన్నాయని, ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య ఇసుకను బుక్ చేసుకోవచ్చని వెల్లడించారు.

తనిఖీలో బయపడిన అవకతవకలు

పాల్వంచరూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2022 – 23లో నిర్వహించిన రూ.5.92 కోట్ల పనులపై సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 15వ విడత ప్రజావేదికను నిర్వహించారు. ఇందులో ఉపాధి సిబ్బంది అవకతవకలు వెలుగుచూశాయి. మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 1 నుంచి 17 వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉపాధి పనుల్లో కొలతలు, మస్టర్ల కొట్టివేతల వంటివి బయటపడ్డాయి. రూ.49,865 రికవరీకి, అవకతవకలకు పాల్పడిన ఉపాధి సిబ్బందికి రూ.9 వేల జరిమానా విధించగా 144 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

సిబ్బందిదే బాధ్యత..

ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండొద్దని అడిషనల్ డీఆర్‌డీఏ ప్రిసైడింగ్ అధికారి ఎస్.రవి హెచ్చరించారు. పనులకు సంబంధించిన మస్టర్లలో కొట్టివేతలు, దిద్దుబాట్లు జరిపితే సిబ్బంది బాధ్యత వహించాల్సి వస్తుందని, మస్టర్లపై వైట్నర్లు వాడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, ఈజీఎస్ అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి రమణారావుతోపాటు అనూష, నాగప్రకాశ్, అనిల్‌కుమార్, పోరండ్ల రంగా, బి.నారాయణ, రాంబాబు, మౌనిక, పుల్లయ్య పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఏరియా వర్క్‌షాప్‌లో తనిఖీ


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న రక్షణాధికారి వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వర్క్‌షాప్‌ను సోమవారం ఏరియా రక్షణాధికారి వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్మికుల రక్షణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, సంస్థ సూచించిన రక్షణ సూత్రాలను కచ్చితంగా పాటిస్తూ ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీర్లు బోడ శంకర్, ఉపేందర్‌బాబు, ఫోర్‌మెన్ మనోజ్, పిట్ కార్యదర్శి మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్లకు శుభాకాంక్షలు


శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నర్సింహారావు


జనక్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌ను సోమవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ అల్లాడి నరసింహారావు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పారు. కాగా, రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన తేజావత్ బెల్లయ్యానాయక్‌ను హైదరాబాద్‌లో సోమవారం కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బానోత్ నవీన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

వేజ్‌బోర్డు కార్పొరేషన్ చైర్మన్‌కు..

సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, జేబీసీసీఐ శాశ్వత సభ్యులైన జనక్ ప్రసాద్‌ను మినిమమ్ వేజ్‌బోర్డు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించగా సోమవారం ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఆల్బర్ట్ కలిసి, సన్మానించారు. కార్యక్రమంలో ఆర్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

కొత్తగూడెంటౌన్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన సోమవారం కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. లారీక్లీనర్‌గా పని చేస్తున్న క్రిస్టోఫర్ నడుచుకుంటూ జీఎం కార్యాలయం వద్ద నుంచి వస్తుండగా గుర్తుతెలియని ద్విచక్రవాహనం వచ్చి ఢీకొట్టింది. గాయపడిన క్రిస్టోఫర్‌ను 108 ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.


క్రిస్టోఫర్‌కు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది